క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం బుధవారం మార్కెట్ విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి చేస్తున్నందున శనివారం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నరసయ్య అగ్రహారం, అల్లూరి సీతారామరాజు బొమ్మ ఏరియా, కుముదవల్లి రోడ్, బుధవారం మార్కెట్, కొత్త బస్టాండ్ ఏరియా, మెంటే వారి తోట, కళాభవన్, సీపీఎం ఆఫీస్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా విలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

వైభవంగా రామాలయ పునః ప్రతిష్ఠ

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామంలో కునుకు వారి వీధిలో అతి పురాతనమైన శిథిలమైన రామాలయాన్ని శుక్రవారం దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పునః ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా రాజ్య సభ సభ్యులు పాకా సత్యనారాయణ, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను కలిగి ఉండాలని, భక్తి భావంతో దైవాన్ని సేవిస్తే మానసిక ప్రశాంతతతో పాటు మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉంటారని అన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఆకివీడు: స్థానిక సమతానగర్‌లో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. స్వామికి అత్యంత ప్రీతికరమైన తమలపాకుల దండలు, అప్పాల దండల్ని ప్రసాదంగా సమర్పించారు. బొల్లా హరికృష్ణ దంపతులు, నేరెళ్ల పెదబాబు, వాడపల్లి రాంబాబు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కూచిపూడిలో ప్రదర్శనల అనంతరం చిన్నారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆకివీడు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా కూచిపూడిలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆకివీడుకు చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి అలరించారు. కూచిపూడి ప్రదర్శనను నృత్యకళాకారులు ఎం.తేజ శ్రీ లక్ష్మి, ఎం.ధనుశ్రీ, పీ.సత్యశ్రీ, ఎస్.జాగృతి చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా యోగాంధ్ర కూచిపూడి ఆధ్వర్యంలో విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు.

ప్రతి వ్యక్తికీ గురువు అనుగ్రహం కావాలి



దత్త క్షేత్రంలో దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం స్థానిక దత్త క్షేత్రంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్త క్షేత్రం కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశంలోనూ, ప్రపంచంలోని పలు దేశాల్లో స్వామి వారి అనుగ్రహంతో దత్త క్షేత్రాలు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాలు, ఆధ్యాత్మిక , ఆయుర్వేద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయంలోని పలువురికి దుస్తులను పంపిణీ చేశారు. దత్త క్షేత్ర ఉపాధ్యక్షుడు నంద్యాల సీతా రామయ్య, జానకీరామరాజు, ముదునూరి శ్రీహరిరాజు, జీఎస్‌వీ త్యనారాయణ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని ఉప్పులూరులో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.4070 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

భీమవరం అర్బన్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలంలోని రాయలంలో గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన క్లోరినేషన్ ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. పీడబ్ల్యూఎస్ స్కీమ్ 2 కింద రూ. 6 లక్షల వ్యయంతో రాష్ట్రంలోనే మొదటి క్లోరినేషన్ ప్లాంట్‌ను గ్రామంలో ఏర్పాటు చేశామన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో ఈ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని చెప్పారు.

పేదల విద్యపై కూటమి కక్ష

- సంక్షేమం ఇవ్వకుండా ఏడాది గడిపేశారంటూ ప్రజల విమర్శలు
- అమ్మ ఒడి ఆపేశారు... తల్లికి వందనం ఇవ్వలేదు..
- జగన్ ప్రభుత్వంలో అత్యధిక ప్రాధాన్యత..



వీరవాసరం మండలం నవుడూరులో సుందరంగా తీర్చిదిద్దిన పాఠశాల భవనం

భీమవరం: పేదల విద్యకు ఆర్థిక అడ్డంకులు తలెత్తకూడదనే ఉద్దేశ్యంతో విద్యారంగంలో సంక్షేమం జోడించి అందరికీ విద్య అందించిన ఘతన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకువచ్చారు. దీంతో పేదల పిల్లలంతా బడిబాట పట్టి ప్రస్తుతం ఉపాధి దిశగా సాగుతున్నారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడగానే 1 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు అమ్మ ఒడి రూపంలో రూ. 15వేలు అందచేశారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పనులు మాన్పించి పాఠశాలలకు పంపించారు. అంతేకాకుండా విద్యాదీవెన, విద్యాకానుక, ఫీజురీయింబర్స్‌మెంట్, వసతిదీవెన, గోరుముద్ద, ఐబీ సిలబస్, విదేశీ విద్య వంటి సౌకర్యాలు పేదలకు కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలన్నీ నాడు నేడు నిధులతో రూపురేఖలు మార్చేయడమే కాకుండా నూతన భవన నిర్మాణాలు, అధునాతనమైన డెస్కులు, బెంచీలు, సురక్షిత తాగునీరు, టాయిలెట్స్, డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెరిగింది. విద్యాకానుక పథకంలో భాగంగా పిల్లలందరికీ యూనిఫామ్, షూస్, టై, బ్యాగ్ వంటి సౌకర్యాలు కల్పించి విద్యావ్యవస్థను ప్రక్షాళన చేశారు.



ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు

దీంతోపాటు 8వ తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌లు ఉచితంగా అందచేసి డిజిటల్ విద్యకు ఉత్తేజాన్ని కలిగించారు. భీమవరం నియోజకవర్గంలోని భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం మండలాల్లో సుమారు 188 ప్రభుత్వ పాఠశాలలున్నాయి.



భీమవరం పట్టణంలో జేఎల్‌బీ స్కూల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన నాడు-నేడు పనులు

వీటిలో సుమారు 13,334 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కళాశాలల్లోని సుమారు 40 వేల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రతి ఏటా రూ. 15 వేలు చొప్పున అమ్మ ఒడి పథకంలో జమచేశారు. స్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు, పాఠశాలలో కంప్యూటర్ విద్య, ఉన్నత చదువులు చదవాలనుకునే విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీవిద్యాదీవెన వంటి అనేక పథకాలు క్రమం తప్పకుండా అందించడంతో నిరుపేదలు సైతం తమ పిల్లలను ఇంజనీర్లు, డాక్టర్స్‌గా నిలబెట్టుకోగలిగారు. ప్రభుత్వపాఠశాలలంటే నేల బెంచీలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు, అపరిశుభ్ర వాతావరణంతో బయపడే రోజుల నుంచి పరిశుభ్రమైన వాతావరణం, పిల్లలకు దుస్తులు, స్కూల్ బ్యాగ్స్, షూస్, బెల్ట్, పుస్తకాలు వంటివి అందించి అందరిచేత ముద్దుగా జగన్ మామయ్య అనిపిలుపించుకోగా నేడు కూటమి ప్రభుత్వంలో దీనికి పూర్తి భిన్నంగా పాలన సాగుతోంది.

పేదల విద్యకు ప్రాధాన్యత ఏది..?

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా విద్యారంగంపై నేటికి దృష్టిపెట్టిన దాఖలాలు లేవనే చెప్పాలి. కుటుంబంలో ఎంతమంది చదువుకుంటే అందరికీ తల్లికి వందనం పేరుతో ఏటా రూ. 15 వేలు ఇస్తాంటూ నీకు 15, నీకూ 15, నీకూ 15 అంటూ గొప్పగా ప్రచారం చేసిన నాయకులు ఏడాదిగా ఆ మాటే మర్చిపోయారు. నాడు నేడు పనులు అంసపూర్తిగా నిలిచిచోట్ల ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. ఏడాదిగా విద్యార్థులు ట్యాబ్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన పంపిణీ చేయకుండానే కాలం గడిపివేశారు. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తామన్న కూటమి నేతలు ఏడాది గడిచపోతున్నా ఇంతవరకు ఎటువంటి హామీలు నెరవేర్చలేదని ప్రజానీకం బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి



భీమవరంలో మొక్కలు పంపిణీ చేస్తున్న వైహెచ్ఏఐ సభ్యులు

భీమవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమవరం యూత్‌హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) ఆధ్వర్యంలో శుక్రవారం వేంద్ర రోడ్‌లోని మున్సిపల్ పంప్ హౌస్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎహెచ్ఏఐ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ సోమరాజు మొక్కలు నాటడమేగాకుండా వాటిని పూర్తిగా సంరక్షించాలని ఒకే జాతి మొక్కలు ఒకే ప్రదేశములో నాటకుండా వివిధ జాతుల మొక్కలు నాటితే జీవ వైవిధ్యానికి సహకరిస్తుందన్నారు. ప్రధానంగా పండ్ల జాతి మొక్కలు మనుషులకేగాకుండా మిగిలిన జీవ రాశులకు కూడా ఆహారంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ ఏడాది వైహెచ్ఏఐ 10 యూనిట్స్‌లో ఉన్న ఆరువేల మంది లైఫ్ సభ్యుల ద్వారా ఆరు వేలు మొక్కలు నాటే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి గాంధీ, మట్లపూడి సత్యనారాయణ, బోనం పాందురంగారావు, శ్రీఖాకొల్లు హనుమంతరావు, కటికిరెడ్డి వెంకటరత్నం, జానపాటి మధుసూదనరావు, నందమూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ మొబైల్ క్యాంపులను వినియోగించుకోవాలి

కాళ్ల/పాలకోడేరు: ఆరేళ్లలోపు వయసున్న పిల్లల ఉన్న తల్లిదండ్రులు ఆధార్ మొబైల్ క్యాంపులను సద్వినియోగం పరుచుకోవాలని కాళ్ల ఎంపీడీఓ జి.స్వాతి, పాలకోడేరు ఎంపీడీఓ వి. రెడ్డియ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు విడివిడిగా ప్రకటనలు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాళ్ల మండలంలో 16 చోట్ల ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేశామని, జూన్ 10 నుంచి 13వరకు అదేవిధంగా జూన్ 24 నుంచి 27వరకు 8 రోజులపాటు జరిగే ఈ క్యాంపులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలకోడేరు మండలంలో 10, 11 తేదీల్లో పాలకోడేరు, శృంగవృక్షం–1, కోరుకొల్లు వద్ద, 12, 13 తేదీల్లో కుముదవల్లి, పెన్నాడ అగ్రహారం –1, మోగల్లు –1 వద్ద, రెండవ విడుతగా 24, 25 తేదీలలో గొల్లల కోడేరు, గోరగనమూడి, కొండేపూడి వద్ద, 26, 27 తేదీలలో గరగపర్రు, విస్సాకోడేరు –1, వేంద్ర వద్ద నిర్వహిస్తామని వివరించారు.

ఎన్‌హెచ్-165 భూములపై అభ్యంతరాల స్వీకరణ

కాళ్ల: ఎన్‌హెచ్ 165 జాతీయ రహదారి అభివృద్ధి పనులు కోసం సేకరించాల్సిన భూములపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహసీల్దార్ జి.సుందర్ సింగ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని కోలనపల్లి, సీసలి, జక్కరం, కోపల్లె, పెదఅమిరం, వేంపాడు గ్రామాల్లో సేకరించబోయే భూముల వివరాలను ఆయా పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డుల్లో పెట్టినట్లు ఆయన తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 14 లోపు తహసిల్దార్ కార్యాలయంలో తెలపాలన్నారు.

ఉండిలో..

ఉండి: మండలంలో జాతీయ రహదారి విస్తరణ కోసం సేకరించే భూముల వివరాల జాబితాను గ్రామ సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచినట్లు తహసీల్దార్ కె.నాగార్జున తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చెరుకువాడ, పెదపుల్లేరు,చినపుల్లేరు గ్రామాలల్లో సేకరించే భూముల వివరాలను ప్రదర్శించామని రైతులు, భూయజమానులు వాటిని పరిశీలించుకోవాలని వివరించారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14లోపు తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి విజ్ఞాన తరగతులు

భీమవరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. భీమవరంలోని వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో 40 రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన తరగతుల శుక్రవారం ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీ, సెల్ ఫోన్స్ వంటివాటితో సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన తరగతులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం శిక్షణ తరగతులను సమర్థవంతంగా నిర్వహించిన గ్రంథాలయ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు, వేసవి విజ్ఞాన తరగతుల కన్వీనర్ అల్లు శ్రీనివాస్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సురేష్ జైన్, మహమ్మద్ సరోజినీ, డ్యాన్స్ మాస్టర్ శ్యామ్, మానవత సంస్థ కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, రాజేష్ జైన్, ఇందుకూరి శివాజీవర్మ, వి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే కష్టాలు దూరం

ఆకివీడు: విద్యార్థులు ఇష్టంగా ఇరవై ఏళ్ల చదివితే 60 ఏళ్ల పాటు సుఖంగా జీవించవచ్చని విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు కాకర్ల రాజరాజేశ్వరి చెప్పారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలాన్ని వృథా చేయకుండా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు విజ్ఞానదాయకమైన పుస్తకాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, లయన్స్ ఆదర్శ క్లబ్ కార్యదర్శి మోరా జ్యోతి రెడ్డి, నెల్లి సతీష్, దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.



భీమవరం: గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



ఆకివీడు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పాలకోడేరులో..

పాలకోడేరు: స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 29 నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు మేథస్సును పెంపొందించే ఎనిమిది రకాల ఇండోర్ గేమ్స్ నిర్వహించి, గేమ్స్ లో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం ఎంఈఓ పి.వెంకట శివ నాగరాజు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ సెలవు దినాల్లో విద్యార్థులు సమయం వృథా కాకుండా విద్యార్థుల మేథస్సుకు పదునుపెట్టే విజ్ఞాన శిబిరాలను జిల్లా గ్రంథాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు.

శుభ్రత పాటించాలి

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ ఇళ్ల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. భీమవరం మండలంలోని చిన అమిరం గ్రామంలో శుక్రవారం ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది చేస్తున్న డ్రై డే పనులను డాక్టర్ క్రాంతి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఇళ్ల ఆవరణలో ఉన్న పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, డ్రెయినేజీ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే ఇంటి కిటికీలకు దోమలు రాకుండా మెస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలకు దూరంగా ఉండాలన్నారు. కరోనా చాప కింద నీరులా విస్తరిస్తుందని ఎవరికైనా జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు ఉంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలన్నారు. ఆయన వెంట ఏపీడమయోలజిస్ట్ జి. సుభాష్, పీహెచ్‌సీ ఎంపీహెచ్ కె. అప్పారావు, ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చినఅమిరంలో డ్రై డే పనులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ క్రాంతి కుమార్

రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి

భీమవరం: స్వాతంత్ర్య సమర యోధుడు, కమ్యూనిస్టు అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శుక్రవారం భీమవరం పార్టీ కార్యాలయంలో రాజేశ్వరరావు 112వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోనాల మాట్లాడుతూ పీడిత, తాడిత అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, భూమి కోసం భుక్తి కోసం శ్రమజీవుల విముక్తి కోసం కమ్యూనిస్టు ఆశయ సాధన కోసం తుది శ్వాస వీడే వరకు చంద్ర పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్, నాగిడి శాంతమూర్తి, ఛాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.



రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

లో-ఓల్టేజ్ సమస్య పరిష్కరించాలని ఆందోళన

కాళ్ల: లో–ఓల్టేజ్ సమస్య పరిష్కరించాలంటూ మండలంలోని దొడ్డనపూడి గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసి కులాలకు చెందిన సుమారు 300 గృహాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో తీవ్ర లో–ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు గతంలో విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయానికి ఆ ప్రాంతంలో ఉన్న బడా రైతు అది ప్రభుత్వ భూమిలో ఉందంటూ ఫిర్యాదు చేయడంతో సరఫరా ఇవ్వకుండా విద్యుత్ శాఖ అధికారులు నిలిపివేశారన్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గడిచిన ఏడాది నుంచి తమ ప్రాంతంలో తీవ్రమైన లో–ఓల్టేజ్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈప్రాంతంలో ఉన్న రైతులంతా తమకు ఇబ్బంది లేదని అధికారులకు లిఖితపూర్వకంగా తెలిపినా, కేవలం ఒక రైతు ఇచ్చిన ఫిర్యాదుకు విద్యుత్ శాఖ అధికారులు తలొగ్గి లక్షలాది రూపాయల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ ను నిరుపయోగంగా వదిలేశారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో కనీసం ఫ్యాన్లు కూడా తిరగని పరిస్థితి ఏర్పడిందని, ప్రస్తుత వేసవిలో చిన్న పిల్లల సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సదరు ట్రాన్స్‌ఫార్మర్ కు విద్యుత్ పునరుద్ధీకరించి తమ కష్టాలు తీర్చాలని కోరారు. కొల్లి వెంకట రామారావు, యిర్రింకి వెంకటేశ్వరరావు, కొల్లి వీరపండు, వెంకటేశ్వరరావు, పేరయ్య, నానాజీ, వెంకటరత్నం, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



విద్యుత్ సరఫరా కనెక్షన్ ఇవ్వకుండా నిలిపివేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ని చూపుతున్న గ్రామస్తులు

గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీ

భీమవరం: బక్రీద్ పర్వ దినాల్లో ఆవులు, దూడలు, ఒంటెల వధ నిషేధమని దీనిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ కె మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం గోవధ నిషేధంపై పశుసంవర్ధకశాఖ, గోసంరక్షణ సమితి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. గోవధ నిషేధం, జంతు సంరక్షణ చట్టం 1977 ప్రకారం రాష్ట్రంలో ఆవులను వధిండాన్ని నిషేధించారని, ఆవు దూడలు వధించడం చట్టరీత్యా నేరమన్నారు. జంతువులను అక్రమ రవాణా చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ భీమవరం డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి సుధీర్‌బాబు, గోసంరక్షణ సమితి అధ్యక్షుడు సుంకర దాసు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీ దృశ్యం

డీఎన్నార్‌లో కేఎల్ రావు జయంతి

భీమవరం: ప్రముఖ ఇంజనీర్ పద్మభూషణ్ డాక్టర్ కేఎల్ రావు జయంతిని భీమవరం డీఎన్నార్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కర్సపాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) మాట్లాడుతూ కేఎల్ రావు జల భారత భాగ్యవిధాత, అపర భగీరథుడని కొనియాడారు. రాతి ఆనకట్టలు, అండర్ గ్రౌండ్ విద్యుదుత్పాదక కేంద్రాలు అన్నీ రకాల పెద్ద చిన్న నిర్మాణాలకి ఎటువంటి విదేశీ సహకారం లేకుండా రూపొందాయంటే అది కేఎల్ రావు ఘనతేనన్నారు. ముందుగా రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాలకోడేరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె వెంకటరాజు, కళాశాల ప్రిన్సిపల్ అంజన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ బిఆర్‌కె వర్మ, చెరుకువాడ రంగసాయి, రత్నం తదితరులు పాల్గొన్నారు.



కేఎల్ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మంచినీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని శాంతి నగర్‌లోని రక్షిత మంచినీటి పథకం ద్వారా దుర్వాసనతో కూడిన పసరు నీరు సరఫరా అవుతుందని ఆప్రాంత మహిళలు, ఐద్వా నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ మేరకు వాటర్ ట్యాంక్ వద్ద నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు డోకల లక్ష్మి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా నగర పంచాయతీ పరిధిలోని పలు ట్యాంకుల ద్వారా కుళాయి నీరు దుర్వాసనతో వస్తున్నాయని, పసర్లుదేరి ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అధికారులు గానీ, కమిషనర్ గానీ వార్డుల్లో పర్యటించడం లేదని, ప్రజా సమస్యలను తెలుసుకోవడంలేదని వాపోయారు. శివారు ప్రాంతాలకు మంచినీరు అందడంలేదన్న సాకుతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి పసర్లతో ఉన్న నీటిని కూడా కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అధికారులు తక్షణం స్పందించి ప్రజలకు తాగునీరందించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు బి.కళ్యాణి, బి.పార్వతి, జీవీ.లావణ్య, జి.అచ్చయ్య, జి.రాణి, పి.కుమారి, కె.వరాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం